క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు



గొల్లవిల్లిలో బైక్‌ను ఢీకొట్టి బోల్తా పడిన ట్రక్ ఆటో

ఉప్పలగుప్తం: మండలంలోని గొల్లవిల్లి గ్రామంలో ఆదివారం ఓఎన్‌జీసీ సెంటర్ వద్ద ఎదురుగా వస్తున్న బైక్‌ను ఆటో ఢీ కొట్టడంతో యువకుడికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఉప్పలగుప్తం పంచాయతీ ఆదిలక్ష్మిపురానికి చెందిన పి.శేఖర్ తన తల్లితో కలిసి మోటారుసైకిల్‌పై అమలాపురం వెళుతున్నారు. గొల్లవిల్లి ఓఎన్‌జీసీ సెంటర్ వద్ద ఎదురుగా వస్తున్న ట్రక్కు ఆటో వారిని ఢీకొట్టి బోల్తా పడింది. ప్రమాదంలో శేఖర్‌కు కాలు విరిగిందని, అతడి తల్లి సురక్షితంగా ఉందని స్థానికులు తెలిపారు. స్థానికులు 108 అంబులెన్సులో శేఖర్‌ను ఆసుపత్రికి తరలించారు.

సుబ్బాలమ్మ సేవలో ఆటో వర్కర్లు



సుబ్బాలమ్మ సేవలో పాల్గొన్న ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు

అమలాపురం టౌన్: స్థానిక హైస్కూలు సెంటరు ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో పట్టణ దేవత సుబ్బాలమ్మ సేవ, జాతర మహోత్సవం ఆదివారం జరిగింది. ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు సేవలో పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. అమ్మవారి ఆలయం నుంచి ఆటో స్టాండ్ వరకూ భారీ ఊరేగింపు సాగింది. బాణసంచా కాల్పులతో విచిత్ర వేషాలు, మంగళ వాయిద్యాలతో ఊరేగింపు వైభవంగా జరిగింది. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, సెంట్రల్ డెల్టా బోర్డు చైర్మన్ కుడుపూడి బాబు, పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు సంసాని బులినాని, కౌన్సిలర్ దొమ్మేటి రాము, జిల్లా ఆటో యూనియన్ అధ్యక్షుడు వాసంశెట్టి సత్తిరాజు, ఊటాల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వైఎస్సార్ జయంతి వేడుకలు



దుబాయ్‌లో వైఎస్సార్ జయంతి వేడుకలు జరుపుకొంటున్న ప్రవాస భారతీయులు

అల్లవరం: దుబాయ్‌లోని ప్రవాస భారతీయులు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి 74వ జయంతి వేడుకలను శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. యూఏఈ దేశంలోని దుబాయ్ అల్ కరమా నగరంలో జబీల్ పార్కులో జరిగిన జయంతి వేడుకల్లో వైఎస్సార్ సీపీ కన్వీనర్లు సయ్యద్ అక్రం బాషా, ప్రసన్న సోమిరెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎం.శ్యామ్, శ్రీనివాస్, కె.కుమార్, ఎం.రమణ, కె.విన్సెంట్, కిషోర్ తదితర ప్రవాస భారతీయులు పాల్గొన్నారు.

వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి

అంబాజీపేట: గ్రామీణ ప్రాంతాల్లోని రోగులకు ఉచితంగా అందించే వైద్య సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ కాండ్రేగుల శ్రీనివాసరావు అన్నారు. గంగలకుర్రు సచివాలయం వద్ద అంబాజీపేట ఉషా డయబెటిక్ అండ్ జనరల్ కేర్ క్లినిక్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. శిబిరానికి వచ్చిన రోగులను వైద్యులు డీవీ సత్యం, వాసంశెట్టి రేణుకలు పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

స్వామి సన్నిధిలో అడిషనల్ ఎస్పీ



స్వామి వారి ఆశీస్సులు అందజేస్తున్న అర్చకులు

మామిడికుదురు: అప్పనపల్లి బాల బాలాజీ స్వామిని ఆదివారం సాయంత్రం పశ్చిమ గోదావరి జిల్లా అడిషనల్ ఎస్పీ ఎ.వెంకటసుబ్బారావు–లక్ష్మీదేవి దంపతులు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వారికి అర్చకులు, వేద పండితులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఉభయ దేవేరులతో కొలువుదీరిన స్వామిని దర్శించుకున్న అనంతరం అర్చకులు స్వామి వారి ఆశీస్సులు అందజేశారు. ఆలయ ఈఓ జి.మాధవి ఆధ్వర్యంలో ఆలయ ధర్మకర్తల మండలి సభ్యుడు చిట్టాల సత్తిబాబు అడిషనల్ ఎస్పీకి స్వామి వారి చిత్రపటంతో పాటు ప్రసాదాలను అందజేశారు.

ప్రక్షాళన మొదలైంది

- మున్సిపాలిటీలో లోపాలను సరిదిద్దేందుకు చర్యలు
- తాగునీటి విభాగం సమస్యలపై ప్రత్యేక దృష్టి

అమలాపురం టౌన్: అమలాపురం మున్సిపాలిటీలోని కొన్ని విభాగాల సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా తప్పిదాలతో పట్టణ ప్రజలకు అందాల్సిన సేవల్లో ఆటంకమేర్పడుతుంది. ప్రధానంగా తాగునీటి విభాగంలో సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల జరిగిన కౌన్సిల్ సమావేశంలో సైతం పాలక, ప్రతిపక్ష కౌన్సిలర్లు తాగునీటి విభాగం పనితీరుపైనే ధ్వజమెత్తారు. ఈ నేపథ్యంలో అసలు ఆ విభాగంలో ఏం జరుగుతుందో ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు ప్రత్యేక దృష్టి సారించారు. తీగ లాగితే డొంక కదిలినట్లుగా తాగునీటి విభాగం సిబ్బందిలో కొందరి బాధ్యతారాహిత్యం వల్ల తాగునీటి సరఫరాలో సమస్యలు తలెత్తుతున్నాయని గుర్తించారు.

పలు లొసుగుల గుర్తింపు

మున్సిపాలిటీని ప్రక్షాళన చేస్తానంటూ ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు వ్యాఖ్యానించడంతో మున్సిపల్ ఉద్యోగ వర్గాల్లో గుబులు పట్టుకుంది. కౌన్సిల్ ఎక్స్ ఆఫిషియో సభ్యుని హోదాలో ఇటీవల జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు తొలిసారిగా పాల్గొని అజెండాలో పారదర్శకత లోపించిన అంశాలపై అభ్యంతరం తెలిపి స్పష్టమైన సంకేతాలిచ్చారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడితో కూడా ఎమ్మెల్సీ మున్సిపాలిటీలో జరుగుతున్న పలు లోపాలపై చర్చించారు. అయిదేళ్ల కిందటి ఓచర్లకు బిల్లుల చెల్లింపులు, ఆయిల్ బిల్లుల చెల్లింపుల్లో అవకతవకలు లాంటి పలు లొసుగులు గుర్తించారు. మున్సిపాలిటీలోని పలు విభాగాల్లో నెల కొన్న లోపాలను సరిదిద్దే ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు ఇటీవల రెండు సార్లు వాటర్ వర్క్స్ విభాగాన్ని, సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులను కౌన్సిలర్లతో కలిసి పరిశీలించారు. ముఖ్యంగా తాగునీటి విభాగంలో డ్రైవర్ల హాజరు పట్టీని పరిశీలించినప్పుడు ఒక డ్రైవర్ అనధికారికంగా విధుల్లో ఉన్నట్లు గుర్తించారు. పట్టణంలో పలు శివార్లకు తాగునీటిని ట్యాంకర్ల ద్వారా అందించే పరిస్థితి ఉంది. ఈ సమయంలో డ్రైవర్ల కొరతతో కొన్ని ట్యాంకర్ల ట్రిప్పులకు అంతరాయం అనివార్యమవుతోంది. అలాగే వాటర్ వర్క్సులో విద్యుత్ మోటార్ల నిర్వహణలో సిబ్బంది నిర్లక్ష్యం వల్లే అవి తరుచూ కాలిపోతూ సరఫరాకు అంతరాయమేర్పడుతుందని తెలుసుకున్నారు. ఈ లోపాలన్నీ ఇక నుంచి పునరావృతం కాకుండా గట్టి చర్యలు చేపడుతున్నారు. ప్రతి విభాగాన్ని అధ్యయనం చేస్తూ అక్కడ జరుగుతున్న లోపాలు, తప్పిదాలకు పూర్తిస్థాయిలో చెక్ పెడుతున్నారు.



అమలాపురం మున్సిపల్ కార్యాలయ భవనం

ప్రజలకు మెరుగైన సేవలందించాలనే



మున్సిపాలిటీ ద్వారా అభివృద్ధితో పాటు పట్టణ ప్రజలకు మెరుగైన సేవలు పారదర్శకంగా అందించాలని మంత్రి పినిపే విశ్వరూప్ తపన పడుతున్నారు. మున్సిపల్ కౌన్సిలర్లతో కలిసి మున్సిపాలిటీని ఓ గాడిలో పెట్టాలన్నదే మా లక్ష్యం. దీనికి మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్‌తో పాటు అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేస్తేనే సాధ్యం అవుతుంది. – కుడుపూడి సూర్యనారాయణరావు, ఎమ్మెల్సీ

మిథున్‌రెడ్డికి మంత్రుల స్వాగతం




ఎంపీ మిథున్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న మంత్రులు విశ్వరూప్, వేణు

అమలాపురం రూరల్: జిల్లా పర్యటనలో భాగంగా రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ స్వగృహానికి ఆదివారం సాయంత్రం విచ్చేసిన ఉభయగోదావరి జిల్లాల వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డికి రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్, రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణు గోపాలకృష్ణ, డాక్టర్ పినిపే శ్రీకాంత్, మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు, చెల్లుబోయిన శ్రీనివాసరావు తదితరులు పుష్ప గుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

మహాలక్ష్మమ్మ, పోలేరమ్మలకు సారె సమర్పణ



భారీ ఊరేగింపుగా సారెను తీసుకొచ్చిన మహిళలు




విశేష అలంకరణలో మహాలక్ష్మమ్మవారు

యానాం: ఆదివారం ఆషాఢమాసంను పురస్కరించుకుని యానాం గ్రామదేవతలైన మహాలక్ష్మమ్మ, పోలేరమ్మ అమ్మవార్లకు ఆదివారం వనితా క్లబ్ తరపున సారెను సమర్పించారు. ఈ సందర్భంగా సుమారు 200 మంది మహిళలు అమ్మవార్లను దర్శించుకుని విశేష పూజలు నిర్వహించారు. భారీ ఊరేగింపుగా బయలుదేరి సారెగా తీసుకొచ్చిన వివిధ రకాలైన పిండివంటలు, చలివిడి, వడపప్పు, పానకాలను అమ్మవార్లకు సమర్పించారు. అనంతరం ఆధ్యాత్మిక గీతాలతో అమ్మవారిని కీర్తించారు. కార్యక్రమంలో వాసవి వనితా క్లబ్ అధ్యక్షురాలు చింతలపూడి సర్వలక్ష్మి, కార్యదర్శి బొండాడ కాశి అన్నపూర్ణ, కోశాధికారి దంగేటి మణిజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

గున్నేపల్లి సత్తెమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు

ముమ్మిడివరం: ఆషాడమాసం ఆదివారం కావడంతో ముమ్మిడివరం మండలం సీహెచ్ గున్నేపల్లి సత్తెమ్మ ఆలయానికి భక్తులు పోటెత్తారు. వివిధ రకాల పండ్లతో అమ్మవారిని అలంకరించి పూజలు చేశారు. జిల్లా నలుమూల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దాతల సాయంతో పులిహోర, బూరెలతో పాటు చంటి పిల్లలకు పాలు పంపిణీ చేశారు.



ప్రత్యేక అలంకరణలో సీహెచ్ గున్నేపల్లి సత్తెమ్మ అమ్మవారు

తాగునీటి సమస్య లేకుండా చేశాం

- ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్

తాళ్లరేవు: ఎన్నో ఏళ్లుగా గుక్కెడు నీటి కోసం ఇబ్బంది పడుతున్న ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా చేశామని ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. చొల్లంగిపేట పంచాయతీ కొబ్బరిచెట్టు పేట గ్రామంలో రూ.40 లక్షల సీఎస్ఆర్ నిధులతో నిర్మించిన తాగునీటి ట్యాంకును ఎమ్మెల్యే పొన్నాడ ప్రారంభించారు. ఆయన స్వయంగా కుళాయిలో తాగునీరు పట్టి స్థానిక మహిళలకు అందించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ మాట్లాడుతూ శివారు ప్రాంత గ్రామాలు అధికంగా ఉన్న తాళ్లరేవు మండలంలో తాగునీటి సమస్య నివారణకు అధిక నిధులు వెచ్చించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ రాయుడు సునీత, ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, స్థానిక సర్పంచ్ కందెళ్ల గంగాభవాని, ఎంపీటీసీ సభ్యురాలు కడియాల మహాలక్ష్మి, నాయకులు బూరెల వెంకట్రాజు, పేర్ని ఆదినారాయణ మూర్తి, పినపోతు చినకామేశ్వరరావు, అంకాడి అంజిబాబు, మైదు హరిబాబు, కొప్పిశెట్టి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.



తాగునీటి ట్యాంకును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి

- పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు

యానాం: యానాం నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు తిరిగి ప్రారంభమయ్యేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తానని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు అన్నారు. నియోజకవర్గానికి సంబంధించి పలు సమస్యలు, భవిష్యత్ కార్యాచరణ తదితర ప్రధాన అంశాలపై పలువురు కార్యకర్తలు, నాయకులతో యర్రాగార్డెన్స్‌లోని ఆయన స్వగృహంలో ఆదివారం సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా రీక్రియేషన్ పేరిట యువతను పక్కదోవ పట్టిస్తున్న పేకాట క్లబ్బులను శాశ్వతంగా మూసివేయాలని డిమాండ్ చేశారు. మెట్టకూరు పరిధిలో గోపాల్‌నగర్‌లో విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో డంపింగ్ యార్డు ప్రతిపాదనను ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలన్నారు. గత కొన్ని నెలలుగా ఉపాధి కోల్పోతున్న కురసాంపేట ఇసుక ర్యాంపు కార్మికులకు ఉపాధి కల్పించాలన్నారు. యానాం తీర గ్రామాలను, పట్టణాన్ని వరద నీటి నుంచి కాపాడేలా వరద రక్షణ గోడను నిర్మించాలని చెప్పారు. పీడబ్ల్యూడీ శాఖలో ఎన్ఎంఆర్‌లుగా విధులు నిర్వహిస్తున్న 121 మంది సర్వీసులను రెగ్యులరైజ్ చేయాలన్నారు. యానాం మాస్టర్‌ప్లాన్ తయారీ కోసం పెండింగ్ సమస్యలను వేగంగా పరిష్కరించాలని కోరారు. సీఎస్ఆర్ నిధులతో 110 పనుల ఆమోదానికి ఓఎన్‌జీసీ సంస్థతో చర్చించాలన్నారు. వైఎస్సార్ లింకింగ్ చానల్ రెండో దశ పనులు చేపట్టాలని, వెంకటేశ్వరస్వామి ఆలయ సముదాయ కమిటీ నూతన కార్యవర్గం ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మల్లాడి శామ్యూల్, మాజీ మున్సిపల్ చైర్మన్ గిడ్ల చంద్రరావు, తిరుకోటి నాగేశ్వరరావు, బోళ్ల జోజి, కార్తీక్, నాగబాబు తదితరులు పాల్గొన్నారు.



ప్రజా సమస్యలపై మాట్లాడుతున్న మల్లాడి కృష్ణారావు

బీజామృతంతో విత్తనశుద్ధి

కొత్తపేట: బీజామృతంతో విత్తనశుద్ధి చేయడం వలన నాణ్యమైన ఉత్పత్తులతో కూడిన అధిక దిగుబడులు సాధించవచ్చని ప్రకృతి వ్యవసాయం బిళ్లకుర్రు యూనిట్ ఇన్‌చార్జ్ (ఎల్ 2) ఎంవీవీ ప్రసాద్ తెలిపారు. మండలంలోని బిళ్లకుర్రు ప్రకృతి వ్యవసాయం యూనిట్ ఆధ్వర్యంలో రైతులు సామూహికంగా జీవామృతంతో వరి విత్తనశుద్ధి నిర్వహించారు. ప్రస్తుతం ఖరీఫ్ ప్రారంభమైన నేపథ్యంలో ప్రకృతి వ్యవసాయంపై యూనిట్ ఇన్‌చార్జ్ ప్రసాద్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. బిళ్లకుర్రు శివారు యెలిశెట్టివారిపాలెంలోని యెలిశెట్టి వెంకటేశ్వరరావు వ్యవసాయ క్షేత్రంలో ఆదివారం బీజామృతంతో విత్తనశుద్ధి నిర్వహించారు.

బీజామృతం తయారీ.. ఉపయోగించే విధానం

ప్రకృతి వ్యవసాయం బీజామృతం తయారీ, ప్రయోజనాల గురించి యూనిట్ ఇన్‌చార్జ్ ఎంవీవీ ప్రసాద్ వివరించారు. 20 లీటర్ల నీటిలో 5 లీటర్ల గోమూత్రం, 50 గ్రాముల గుల్ల సున్నం కలిపి, ఆ ద్రావణంలో 5 కేజీల ఆవుపేడ గుడ్డలో కట్టి ఆ ద్రావణంలో 12 గంటలు నానబెట్టాలి. పేడకసర దిగి బీజామృతం తయారవుతుంది. ఈ ద్రావణం 10 ఎకరాలకు సరిపడా 200 కేజీల విత్తనాల శుద్ధికి సరిపోతుంది. ఈ బీజామృతంతో విత్తనశుద్ధి చేయడం వలన విత్తనం నుంచి, నేల నుంచి వ్యాపించే వ్యాధులు రాకుండా దోహదపడుతుంది. ఈ బీజామృతం కేవలం విత్తనశుద్ధికే కాకుండా నారుశుద్ధికి కూడా ఉపయోగపడుతుంది. వరి విత్తనాలకే కాకుండా కాయగూరలు, నారుకు కూడా ఉపయోగించవచ్చని వివరించారు. కార్యక్రమంలో ఫార్మర్ సైంటిస్టు కె.అరుణకుమారి, ఐసీఆర్‌పీలు యెలిశెట్టి వెంకటేశ్వరరావు, ఎం.సునీత, డి.శ్రీలక్ష్మి, కె.కళ్యాణి, కే అనితకుమారి, పలువురు రైతులు పాల్గొన్నారు.

ప్రజల ఇంటి ముంగిటకే ప్రభుత్వ పథకాలు

- ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్
- చొల్లంగిపేటలో రెండో రోజూ గడప గడపకూ మన ప్రభుత్వం

తాళ్లరేవు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజల ఇంటి ముంగిటకే ప్రభుత్వ పథకాలు అందిస్తున్నారని ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. చొల్లంగిపేటలో ఆదివారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం ద్వారా ఆయా కుటుంబాలకు అందిన సంక్షేమ లబ్ధిని వివరించారు. కార్యక్రమంలో మహిళలు ఆయనకు హారతులు పట్టి స్వాగతం పలికారు. ప్రజా సమస్యలు తెలుసుకుంటూ ప్రభుత్వ లబ్ధిని వివరిస్తూ కరపత్రాలు అందిస్తూ ముందుకు సాగారు. ముఖ్యంగా రహదారులు, డ్రైనేజీలు నిర్మించాలని పలువురు కోరారు. సాంకేతిక కారణాలతో అమ్మ ఒడి రావడం లేదని, పింఛన్లు ఇప్పించాలని పలువురు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఆయా సమస్యలను తక్షణమే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాయుడు సునీత, ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, పార్టీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాదా గోవిందకుమార్, రాయుడు గంగాధర్, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు టేకుమూడి నాగేశ్వరరావు, మండల సచివాలయాల కన్వీనర్ దున్నా శ్రీకాంత్, నాయకులు కడియాల శ్రీను, మైదు హరిబాబు, బూరెల వెంకట్రాజు, కొపనాతి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



గడప గడపకూ కార్యక్రమంలో స్థానిక మహిళకు కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ తదితరులు

సర్టిఫికెట్ల జారీలో నిబంధనలు పాటించాలి

యానాం: యానాం రీజియన్‌లో ఈడబ్ల్యూఎస్ (ఎకనమికల్లీ వీకర్ సెక్షన్) సర్టిఫికెట్ల జారీలో నిబంధనలు పాటించాలని పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు రీజినల్ అడ్మినిస్ట్రేటర్ మునిస్వామికి విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా యానాం రీజియన్‌లో ఎంబీబీఎస్ సీట్ల కోసం ఆర్థికంగా బలమైనవారు సైతం ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్‌ను పొందుతున్నారని ఆరోపించారు. యానాం రీజియన్‌లో చదువుకున్నవారికి ఎంబీబీఎస్ సీట్ల కేటాయింపులో ప్రాధాన్యమివ్వాల్సి ఉన్నా అది జరగడం లేదన్నారు. ఇతర రాష్ట్రాల్లో ప్రముఖ కార్పొరేట్ కాలేజీల్లో లక్షలాది రూపాయిలు ఖర్చు చేసి చదువుతున్నవారు ఆర్థికంగా వెనకబడిన కోటాకు ఎలా అర్హులవుతారని ప్రశ్నించారు. కేవలం రేషన్‌కార్డులో పేరు చూపించి ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్‌ను పొందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యానాంలో మాత్రమే ఇంటర్ చదివి, తల్లిదండ్రులు ఇక్కడే నివాసం ఉంటూ రేషన్‌కార్డు ఉన్నవారికి మాత్రమే ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్ మంజూరుచేయాలని కోరారు.

తొలి మహిళ కవయిత్రి మొల్లమాంబ

రాజోలు: తెలుగు రామాయణం రచయిత, తొలి తెలుగు మహిళ కవయిత్రి ఆతుకూరి మొల్లమాంబ అని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. ఆదివారం రాజోలు కాటన్ పార్కులో మొల్లమాంబ విగ్రహాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ, సంస్కృతంలో ఉన్న రామాయణాన్ని సరళమైన తెలుగులోకి అన్వయించిన కవయిత్రి మొల్లమాంబ అని తెలిపారు. కోనసీమ కుమ్మరి శాలివాహన లీడర్ పి.వెంకట రమణ, స్థానిక ప్రజా ప్రతినిధులు, కుమ్మరి శాలివాహనులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

శాకంబరిగా అన్నపూర్ణాదేవి

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వరస్వామివారి ఆలయ ప్రాంగణంలో కొలువైన అన్నపూర్ణాదేవిని ఆషాఢమాసం సందర్భంగా ఆదివారం శాకంబరిగా అలంకరించారు. ఆలయ ప్రధానార్చకులు అన్నపూర్ణ అమ్మవారిని వివిధ కూరగాయలతో అలంకరించారు. భక్తులకు శాకంబరిగా దర్శనమిచ్చారు. అమ్మవారికి విశేష పూజలు చేశారు.

వనువులమ్మ ఆలయంవద్ద చండీహోమం

అయినవిల్లి: మండలంలోని విలసలో వనువులమ్మ ఆలయం వద్ద శనివారం చండీహోమం నిర్వహించారు. ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో ఈ హోమం నిర్వహించారు. గ్రామ ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఈ హోమం నిర్వహించినట్లు తెలిపారు. అమ్మవారిని ఈ సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు దర్శించి పూజలు జరిపారు.

ఎన్ఆర్ఐ గోపి లీలకు తానా అవార్డు



ఆత్రేయపురం: గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ వేగేశ్న రామకృష్ణంరాజు (గోపి లీల)కు తానా మెరిటోరియస్ ఎక్సలెన్స్ ఇన్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అవార్డు దక్కించుకున్నారు. స్వదేశానికి వచ్చినప్పుడు ఉన్నత విద్యా సంస్థల్లో గెస్ట్ లెక్చరర్‌గా విద్యార్థుల్లో వ్యక్తిత్వ వికాసం, సమకాలీన సమాజంలో మన అవకాశాల గురించి వివరణాత్మక బోధన చేస్తారు. అలాగే గ్రామంలో పలు ప్రసిద్ధ ఆలయాలకు రూ.లక్షలు విరాళాలు అందించారు. పేద విద్యార్థులకు తమ సంస్థల ద్వారా తోడ్పాటు అందిస్తారు. గోపిలీలకు తానా అవార్డు రావడంపై ఆత్రేయపురం గ్రామంలో పలువురు అభినందిస్తున్నారు.

ఉచిత స్టడీ మెటీరియల్ పంపిణీ

అమలాపురం రూరల్: ప్రిలిమినరీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి మెయిన్ పరీక్షలకు సిద్ధమవుతున్న 80 మంది పోలీస్ ఉద్యోగార్థులకు శ్రీ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మోకా రమాదేవి, విజయవాడ డీసీపీ మోకా సత్తిబాబుల చేతుల మీదుగా ఉచిత స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. ఆదివారం ఈదరపల్లి అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్‌లో జరిగిన సభలో డీసీపీ సత్తిబాబు మాట్లాడుతూ ప్రతి అభ్యర్థి కష్టపడి పరీక్షలో విజయం సాధించాలని, అందుకు అవసరమైన తోడ్పాటును తాము అందిస్తామని విద్యార్థులకు తెలియజేశారు. విద్యార్థులు ఎలా సన్నద్ధమైతే విజయం సాధించొచ్చో మాజీ ఐఏఎస్ అధికారి పీఏస్ఎన్ మూర్తి వివరించారు. కార్యక్రమంలో న్యాయవాది పెయ్యల శ్రీనివాసరావు, ఏపీ ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గోసంగి బంగార్రాజు, మాజీ సర్పంచ్ నక్కా సంపత్, నక్కా చంద్రశేఖర్, పెనుమాల చిట్టిబాబు, బళ్ళ సత్యనారాయణ, గూటం సాయి, విజయబాబు తదితరులు పాల్గొన్నారు.



పోలీస్ ఉద్యోగార్థులకు స్టడీ మెటీరియల్ అందిస్తున్న విజయవాడ డీసీపీ మోకా సత్తిబాబు

ఘనంగా ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం

అమలాపురం టౌన్: ఏబీవీపీ 75వ ఆవిర్భావ దినోత్సవం స్థానిక వడ్డిగూడెం బాలిక హాస్టల్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హాస్టల్‌లో విద్యార్థులతో ఏబీవీపీ నాయకులు సెమినార్ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఆర్ఎస్ఎస్ జిల్లా సహ కార్యవాహ పవన్, జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి మోకా వెంకట సుబ్బారావులు హాజరై ప్రసంగించారు. ఏబీవీపీ దేశ సమగ్రతను కాంక్షిస్తూనే విద్యార్థుల పురోభివృద్ధి, విద్యా ప్రగతి కోసం పాటుపడుతున్న సంస్థ అని ఏబీవీపీ జిల్లా సంఘటన కార్యదర్శి కంటిపల్లి నరేందర్‌రెడ్డి అన్నారు. ఏబీవీపీ ప్రతినిధులు పవన్, వంశీ, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.



అమలాపురంలో ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు, నాయకులు

నిత్యాన్నదానానికి రూ.10 వేల విరాళం

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి వారి సన్నిధిలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన ట్రస్టుకు పశ్చిమగోదావరి జిల్లా ఆచంట మండలం వల్లూరుకు చెందిన చిట్టూరి పెద్దిరాజు–భారతిలక్ష్మి దంపతులు ఆదివారం రూ.10,116 విరాళం అందించారు. దాత దంపతులకు ఆలయ ఈఓ జి.మాధవి, ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, ట్రస్టు బోర్డు సభ్యులు చిట్టాల సత్తిబాబు, కొమ్ముల సూరిబాబు, గూటం శ్రీనివాస్, ఆలయ ఉద్యోగులు స్వామి వారి చిత్రపటంతో పాటు ప్రసాదాలను అందించారు.



దాత పెద్దిరాజు దంపతులకు స్వామి చిత్రపటం అందజేస్తున్న ట్రస్టీలు